క్లుప్తంగా

ఘనంగా మల్లన్న పండుగ



మాక్లూర్: మండల కేంద్రంలోని మల్లన్న స్వామి ఆలయంలో స్థానిక గొల్ల కులస్తులు సోమవారం మల్లన్న పండుగను ఘనంగా నిర్వహించారు. మల్లన్నస్వామి, మేడాలమ్మ కేతమ్మ కల్యాణం చేపట్టారు. అనంతరం ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం దున్నే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పండుగ బుధవారం పాటు కొనసాగుతుందని కులపెద్ద మహేందర్ తెలిపారు.

అక్రమ పైపులైన్ నిర్మాణం పరిశీలన



నవీపేట: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ స్థలంలో రెండు రోజుల క్రితం వెలసిన అక్రమ పైపులైన్ నిర్మాణాన్ని ఎంపీడీవో నాగనాథ్ సోమవారం పరిశీలించారు. పరిసర ప్రాంతంలోని కమర్షియల్ కాంప్లెక్స్ యజమాని పోస్టాఫీస్ స్థలం వెంబడి పైపులైన్‌ను విస్తరించి కొద్ది దూరంలో ఉన్న డ్రైనేజీలోకి విస్తరించారు. స్థానిక కార్యదర్శి రవీందర్ నాయక్ ఆదివారం నిర్మాణాన్ని అడ్డుకున్నారు. సోమవారం నిర్మాణాన్ని పరిశీలించిన ఎంపీడీవో రెండు రోజుల్లో నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని సంబంధిత యజమానిని ఆదేశించారు.

జీపీని తనిఖీ చేసిన డీఎల్‌పీవో



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో శివకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. జీపీలో రికార్డులను పరిశీలించారు. అంతరం గ్రామంలో డంపింగ్ యార్డు, నర్సరీని పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వేను పర్యవేక్షించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరేశ్, సిబ్బంది ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీలు



వేల్పూర్: మండలంలోని పడగల్, పచ్చలనడ్కుడ గ్రామాల్లో స్థానిక హైస్కూళ్ల విద్యార్థులు సోమవారం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని మోతె హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన మండలస్థాయి క్రీడల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. దీంతో తమ విజయాన్ని గ్రామస్తులకు చాటిచెబుతూ, మెమెంటోలను ప్రదర్శిస్తూ ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు రాంచందర్, రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు, పీఈటీలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు రావాలి

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో హైదరాబాద్ నుంచి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు మండలంలోని అన్ని గ్రామాల రైతులు రావాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటకోత తర్వాత వరి కొయ్యలకు నిప్పు పెట్టకుండా వాటిని నిర్మూలించే అంశంపై అధికారులు అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు ఉదయం 10 గంటలకు రైతు వేదికకు రావాలని కోరారు.

కుర్చీల వితరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాంమందిర్ పాఠశాలకు సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు రజినీశ్ కిరాడ్ మాట్లాడుతూ.. నేటి యువతరం చదువులో ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో పట్వారి తులసి, రాస ఆనంద్, శశిధర్, గోపికృష్ణ, గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ తెలిపారు. జిల్లా కోర్టులోని రెండో ఫ్లోర్‌లో వైద్యశిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక

- చేతివాటం ప్రదర్శించిన ఫీల్డ్‌అసిస్టెంట్లు
- డబ్బుల రికవరీకి ఆదేశించిన డీఆర్డీవో సాయాగౌడ్


వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో సాయాగౌడ్

నందిపేట్: ఉమ్మడి నందిపేట మండలంలోని 33 జీపీ పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేపట్టిన రూ. 9 కోట్లతో వివిధ పనులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన పనులపై ఈ నెల 3 నుంచి డీఆర్పీలు రికార్డులు పరిశీలించగా ఈ నెల 6 నుంచి గ్రామాల్లో ఎస్‌ఆర్‌పీలు, వీఏలు సామాజిక తనిఖీలు చేపట్టారు.

అవకతవకలు..

ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించినట్లు ప్రజావేదికలో వెల్లడైనట్లు అధికారులు గుర్తించారు. లక్కంపల్లిలో సుమారు 850 మొక్కలు చనిపోయనట్లు గుర్తించారు. వీటితో పాటు పలు గ్రామాల్లో మొక్కలు నాటకుండానే నాటినట్లు రికార్డులు చూయించి డబ్బులు తీసుకున్నారు. మండల కేంద్రంలో రోజ్‌గార్ దివస్ రికార్డులను ఫీల్డ్ అసిస్టెంట్ శివ మెయింటెన్ చేయలేదని, ఒకే కుటుంబానికి రెండు జాబ్‌కార్డులు ఇచ్చి సంతకాలు లేకుండా డబ్బులు చెల్లించి అవకతవకలకు పాల్పడ్డారన్నారు నందిపేటకు చెందిన ఎర్రం రమ్య, చేసూరి సుప్రియ అనే మహిళలు పనులు చేయకుండానే ఒక్కొక్కరికి 78 రోజులు పనిచేసినట్లు డబ్బులు తీసుకున్నారని క్షేత్రస్థాయి విచారణలో బృందం సభ్యులు గుర్తించారు. వీరి నుంచి రికవరీకి అధికారులు ఆదేశించారు. ఇలా ప్రతి గ్రామంలో జరిగిన అవకతవకలు తనిఖీ అధికారుల దృష్టికి తీసుకురాగా వాటి రికవరీకి ఆదేశించినట్లు డీఆర్డీవో సాయాగౌడ్ పేర్కొన్నారు. తనిఖీలో విజిలెన్సు అధికారి నారాయణ, ఎంపీడీవోలు శ్రీనివాస్‌రావు, నాగవర్ధన్, ఎస్‌ఆర్‌పీ సురేశ్‌బాబు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోతంగల్ విండో బాధ్యతలు స్వీకరించిన అధికారులు


బాధ్యతలు స్వీకరించిన అధికారులు

రుద్రూర్: పోతంగల్ విశాల సహకార సంఘం పాలకవర్గం రద్దు కాగా సోమవారం సహకార శాఖ అధికారులు రియాజుద్దీన్, ఎన్ వెంకటేశ్వరరావు ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. విండో సీఈవో భరత్ నిర్లక్ష్యం, పాలకవర్గం అసలత్వంతో సంఘం నష్టాల ఊబిలో కూరుకుపోతోందని గుర్తించిన విండో సభ్యులు డీసీవోకు ఫిర్యాదు చేశారు. డీసీవో ఆదేశాల మేరకు సహకార అధికారులు కో–ఆపరేటివ్ యాక్ట్–51 ప్రకారం విచారణ చేపట్టి సంఘం లావాదేవీల్లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. నెల రోజుల క్రితం విండో సీఈవో భరత్‌ను సస్పెండ్ చేశారు. సంఘ కార్యకలాపాల్లో అలస త్వం వహించిన పాలకవర్గానికి నోటీసులు జారీచేశారు. వారి నుంచి సరైన సమాధానం రానందున పాలకవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు డీసీవో ఉత్తర్వులు జారీ చేశా రు. దీంతో విండో అడ్మినిస్ట్రేటర్లుగా డీసీవో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రియాజుద్దీన్, కోటగిరి సహకార బ్యాంక్ అధికారి ఎన్ వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

ఎడపల్లి విద్యుత్ ఏఈగా కిశోర్‌రెడ్డి



ఎడపల్లి: మండల విద్యుత్‌శాఖ నూతన ఏఈగా కిశోర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ విద్యుత్ పవర్ హౌస్‌లో ఎస్టీ మీటర్ సెక్షన్లో విధులు నిర్వహిస్తున్న కిశోర్‌రెడ్డి ఉద్యోగోన్నతిపై ఎడపల్లి ఏఈగా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఏఈని శాలువాతో సన్మానించారు

సంబురాలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏపీఎం గంగాధర్

కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రథమ వార్షికోత్సవం పూర్తి చేసుకున్న సందర్భంగా డ్వాక్రా మహిళలకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలపై అవగాహన కల్పించే నిమిత్తం నిర్వహించే ఇందిరా మహిళా శక్తి సంబురాలను విజయవంతం చేయాలని కమ్మర్‌పల్లి ఏపీఎం, ఐకేపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఈమేరకు మహిళా సంఘాల ప్రతినిధులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండి అర్హత ఉన్న ప్రతి మహిళ మహిళా సంఘాల్లో సభ్యురాలిగా చేర్పించాలని ఇందుకోసం సీసీలు వీవోఏలు గ్రామ సమాఖ్య అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, కార్యదర్శి వాసవి, సీసీలు రవికుమార్, భాగ్యలక్ష్మి, అలేఖ్య, అకౌంటెంట్ ధనలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలి


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బోధన్: ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేసి, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆందోళనకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతను తీర్చాలని, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

నవనాథ సిద్ధులగుట్టపై దీపోత్సవం


రామాలయ ఆవరణలో దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


ఉత్సవమూర్తులకు పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం, రామాలయం, దత్తాత్రేయ, దుర్గామాత, అయ్యప్ప ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో బి సుమన్, పీసీ గంగారెడ్డి, చరణ్‌రెడ్డి, కొడిగల మల్లయ్య, జిమ్మి రవి, కొంతం ముంజుల తదితరులు పాల్గొన్నారు.

నూతన కారు ఆవిష్కరణ


వరుణ్ మోటార్స్‌లో నూతనకారును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వరుణ్ మోటార్స్‌లో సోమవారం నూతన మోడల్ డిజైర్ కారును ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ముగ్గురు వినియోగదారులకు నూతన కార్లను అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ ధరమ్ సందీప్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌లో..


కారు కీని అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్

బోధన్ టౌన్(బోధన్): మారుతి సుజుకి ఆలిండియా వరుణ్ మోటార్స్ నుంచి రూపొందిన న్యూ డాజిలింగ్ డిజైర్ కారును బోధన్ ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్య దామోదర్ సోమవారం లాంచ్ చేశారు. అనంతరం కారును కొనుగోలు చేసిన తహసీల్దార్ రజని దంపతులకు ఏఎంసీ చైర్‌పర్సన్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ ఎం వేణుగోపాల్, బోధన్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సకాలంలో పూర్తిచేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సమగ్రకుటుంబ సర్వేకు సంబంధించిన సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొన్ని వార్డుల్లో మందకొడిగా సర్వే కొనసాగుతోందని సూపర్ వైజర్లు ఆ బ్లాక్‌ల్లో పర్యవేక్షించి సర్వేను వేగవంతం చేయాలన్నారు. మరికొన్ని చోట్ల ఎన్యుమరేటర్లు తమ బ్లాక్‌లో సర్వేపూర్తి చేసిన వారికి ఇతర బ్లాక్‌లో సర్వే చేసేవిధంగా చూడాలన్నారు. ఇప్పటివరకు 70 శాతం సర్వే పూర్తయిందని, మరో మూడు రోజుల్లో 30 శాతం ఉన్న సర్వేను పూర్తిచేయాలని సూపర్‌వైజర్లకు సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి



మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర సర్వేలో ఆదివాసి నాయక్‌పోడ్ సంఘ సభ్యులు సహకరించాలని ఆదివాసి నాయక్‌పోడ్ ఉద్యోగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ సూచించారు. సోమవారం మండలంలోని శెట్‌పల్లిలో నాయక్‌పోడ్ సంఘం సభ్యులతో ఆయన మాట్లాడారు. సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్‌లకు నాయక్ పోడ్ సంఘం సభ్యులు ఎస్టీ అని రాయించాలని తెలిపారు. వివరాలను పక్కాగా నమోదు చేయించాలని, ఎలాంటి అపోహలకు గురికావద్దని చెప్పారు. కార్యక్రమంలో కుల సంఘం పెద్దలు బొమ్మెన సుదర్శన్, సచిన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రెంజల్: మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను రెంజల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు సాయారెడ్డి, ధనుంజయ్, సాయిబాబాగౌడ్, జావిద్, రాములు, గంగాకృష్ణ, ఇందిరారెడ్డి, సా యాగౌడ్, షబ్బీర్, రాజు, షమీ, ఆసాని అనిల్, పోచయ్య, కుర్మె శ్రీనివాస్, వెంకటి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: మాక్లూర్‌లోని కేజీబీవీలో బంగారు గొలుసు పోయిందని ఓ విద్యార్థినిని మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్ మాట్లాడుతూ.. కేజీబీవీలో 6వ తరగతి విద్యార్థినిని మంత్రగాడికి దగ్గరికి తీసుకెళ్లిన ఘటనలో ప్రధాన బాధ్యులైన సోషల్ సీఆర్టీ గౌతమి రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు సంబంధంలేని అమాయకులైన ముగ్గురిని బదిలీ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. తక్షణమే గౌతమిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అషూర్, సజన్, శివకుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఆర్డర్ కాపీల అందజేత


రేషన్ డీలర్లకు ఆర్డర్ కాపీలను అందిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్ టౌన్: సబ్ కలెక్టర్ కార్యాలయ పరిధిలో నూతనంగా ఎంపికైన రేషన్ డీలర్లు 18 మందికి ఆర్డర్ కాపీలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో సోమవారం అందించారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా రేషన్ దుకాణం నడపాలని, సమయపాలన పాటించాలని డీలర్లకు సబ్ కలెక్టర్ సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి, అంకాపూర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ కృష్ణ తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


పెర్కిట్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను


మెండోరాలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు


రామన్నపేట్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలకిషన్

పెర్కిట్/ బాల్కొండ/ వేల్పూర్/ కమ్మర్‌పల్లి: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. పెర్కిట్‌లో సోమవారం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను పరిశీలించారు. సర్వేలో వివరాలు నమోదు చేసేటపుడు తప్పులు దొర్లకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్యుమరేటర్లు షాబాజ్ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మెండోరాలో ఎంపీవో సాయిలు సర్వేను పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. వేల్పూర్ మండలం రామన్నపేట్‌లో సమగ్రసర్వేను ఎంపీడీవో బాలకిషన్ పరిశీలించారు. సర్వే తీరును గ్రామ కార్యదర్శి రమేశ్‌తో కలిసి పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను స్థానిక కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల విడుదల



రుద్రూర్: మండల కేంద్రంలోని రుద్రూర్ పెద్ద చెరువులో, మండలంలోని రాణంపల్లి చెరువులో చేప పిల్లలను తహసీల్దార్ తారాబాయి, మండల అభివృద్ధి అధికారి సురేశ్‌బాబు సోమవారం విడుదల చేశారు. రుద్రూర్ చెరువులో 3లక్షల52వేలు, రాణంపల్లి చెరువులో 36వేల310 చేప పిల్లలు విడుదల చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, రాయకూర్ విండో వైస్ చైర్మన్ తోట అరుణ్ కుమార్, విండో డైరెక్టర్ కర్క అశోక్, నాయకులు పార్వత ప్రవీణ్, నిస్సార్, పోతరాజు లింగం, అడపా సాయిలు, సరేందర్, వడ్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమాచారం

■ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థిని


విజ్ఞత

పెర్కిట్: ఆర్మూర్ మండలం మగ్గిడి మాజీ సర్పంచ్ సుద్దపల్లి సుమలత నర్సయ్య కుమార్తె, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుద్దపల్లి విజ్ఞత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధు సోమవారం తెలిపారు. మెదక్ జిల్లా చేగుంటలో ఈ నెల 16 నుంచి 18 వరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంలో అద్భుత ప్రతిభ కనబరిచిన విజ్ఞత జాతీయ స్థాయికి ఎంపికైంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి, పాఠశాల హెచ్‌ఎం హరిత, పీఈటీ మధు, ఉపాధ్యాయులు అభినందించారు.

■ ఉషూ పోటీల్లో సత్తా చాటిన 'లిటిల్' విద్యార్థులు



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో సత్తా చాటారు. 48 కిలోల విభాగంలో లక్ష్మి, 40 కిలోల విభాగంలో ముజమ్మిల్, జ్ఞానేశ్ బంగారు పతకాలు, 39 కిలోల విభాగంలో మనస్విని, 36 కిలోల విభాగంలో అనాస్ బంగారు పతకం సాధించారు. అంతే కాకుండా అనాస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

■ విద్యతో పాటు క్రీడలు అవసరం



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని ఈఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ప్రతిరోజు క్రికెట్ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు కోచ్ సలీం వినతి మేరకు క్రికెట్ పరికాలను క్రీడాకారులకు ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం క్రికెట్ కోచ్ సలీం రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సి పల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, రోటరీ అధ్యక్షుడు రజినీశ్ కిరాడ్, కమిటీ సభ్యులు, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	గ్లాడియేటర్-2 (తెలుగు)-9.35 7.35 లక్కీ భాస్కర్ 12.50 10.50 అమరన్(తెలుగు)-4.05
స్క్రీన్-2	డమ్మీ మూవీస్ -3.00 5.30 8.00 10.30
స్క్రీన్-3	కంగువ (తెలుగు)-12.00 3.20 6.40 10.00
స్క్రీన్-4	అమరన్(తెలుగు)-11.30 మట్కా(తెలుగు)-3.00,6.25,9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫిషియన్)

స్క్రీన్-1	అమరన్ -10.30 4.25 10.30 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ(2డీ-తెలుగు)-10.30 4.30 10.40 అమరన్ -1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా(తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్(తెలుగు)-4.15 గ్లాడియేటర్(తెలుగు)- 7.30 అమరన్(తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800